పౌరసేవలు వేగవంతం: కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, న్యూస్‌టుడే : పౌరసేవలు వేగవంతంగా అందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీజీఆర్ఎస్ దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ల పరిశీలన, హైకోర్టు, ఆర్టీఐ, జాతీయ మానవహక్కుల కమిషన్ కేసులు, భూసేకరణ, నీటిపన్ను వసూళ్లు, డివిజన్ స్థాయి విజిలెన్సు మానిటరింగ్ కమిటీ తీర్మానాలు, వాటి అమలు, ఓటర్ల జాబితా సవరణ తదితర అంశాలపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అత్యధికంగా భూ సమస్యలే వస్తున్నాయన్నారు. శ్మశాన వాటిక స్థలాల దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన పరిపాలన సంస్కరణలను పక్కాగా అమలు చేసి వాటి ఫలితాలు అర్హులకు అందేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.

తాగునీటి కాలుష్యం నివారణకు చర్యలు : జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మంజూరైన ప్రతి పని వంద శాతం ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. సిమెంటు, తారు రోడ్ల నిర్మాణాలు, పశువుల షెడ్ల ఏర్పాటు, సామూహిక మురుగు గుంతల నిర్మాణం, నీటి సంరక్షణ పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. డిసెంబరు 31 లోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. జిల్లాలో 1,200 పశువుల షెడ్లు మంజూరు చేయగా, కేవలం 600 మాత్రమే ప్రతిపాదనలొచ్చినట్లు తెలిపారు. మిగిలిన వాటికి మూడు రోజుల్లో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణరావు, జిల్లా సర్వేశాఖ ఏడీ భరత్‌కుమార్, పీఆర్ ఎస్ఈ దయాకర్‌రెడ్డి, డ్వామా పీడీ వెంకటరత్నం, డీపీవో బాలకృష్ణారెడ్డి, జీఎస్‌డబ్ల్యువో లక్ష్మీపతి, అధికారులు పాల్గొన్నారు.

ప్రస్తావించాలి... పరిష్కరించాలి!

- రైతులకు చేయూతనివ్వాలి
- అధ్వానంగా వసతిగృహాలు
- రహదారులదీ అదే పరిస్థితి
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి పంట

–ఈనాడు, కడప

ఎంతో కీలకమైన జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం పది గంటలకు ప్రారంభం కానుంది. సమావేశంలో ఉమ్మడి కడప జిల్లాలోని సమస్యలపై చర్చించడంతో పాటు పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. అవసరమైన అంశాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి ఆదుకునే దిశగా ప్రయత్నాలు జరగాలి. ప్రత్యేకించి వ్యవసాయ రంగం కుదేలైపోయింది. రైతులు ఆర్థికంగా నష్టాలపాలయ్యారు. రబీకి సన్నద్ధం చేసే దిశగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రహదారులు అధ్వానంగా మారాయి. వీటి మరమ్మతులు వేగవంతం చేయాల్సి ఉంది. విద్య, వైద్య, పశు వైద్య రంగాలపై విస్తృతంగా చర్చ జరగాలి. వసతిగృహాల్లో అక్రమాలు, అవినీతికి హద్దులు లేకుండా పోయింది. ప్రత్యేకించి వెనుకబడిన తరగతుల విభాగంలో విద్యార్థుల సంఖ్యను బట్టి నెలవారీ వసూళ్లకు పాల్పడుతున్నారు.

- ఖరీఫ్‌లో వర్షాభావంతో ఉమ్మడి కడప జిల్లాలో 7 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 3 వేల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ప్రధానంగా వరి పంటతో పాటు ఉద్యానతోటలు దెబ్బతిన్నాయి. బాధిత రైతులకు ఆర్థికసాయం అందించే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. చాలా చోట్ల చీనీ మొక్కలు తెగుళ్లతో ఎండిపోతున్నాయి. వీటికి పరిష్కారం చూపడంలేదు. రబీ సీజన్‌కు జల వనరులు పుష్కలంగా అందుబాటులోకి వచ్చాయి. అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు అందించే దిశగా చర్యలు చేపట్టాలి. ఈ మేరకు అర్థవంతమైన చర్చ ద్వారా రైతాంగాన్ని అందుకునే దిశగా... సాయం అందే విధంగా తగు విధంగా సన్నద్ధం చేయాల్సి ఉంది. తాగునీటి పథకాలైన సీపీడబ్ల్యూ పేరిట ఉన్నవి చాలా వరకు నిర్వహణ లోపంతో ఉన్నాయి. కొందరు ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో వ్యవస్థ నాశనమైపోయింది. వీటిని బాగు చేసి ప్రజానీకానికి సురక్షితమైన నీరందించాల్సి ఉంది.
- ఉమ్మడి కడప జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులు మరింతగా దెబ్బతిన్నాయి. వీటిని మరమ్మతులు చేయాల్సి ఉంది. జాతీయ రహదారుల నిర్వహణ అధ్వానంగా తయారైంది. టోల్ వసూలు చేస్తున్నప్పటికీ రహదారులు దయనీయస్థితిలో ఉన్నాయి. పర్యవేక్షణ లోపంతో గుత్తేదారులు వాహనదారుల నుంచి దోచుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు అందిస్తున్నందున రహదారుల మరమ్మతులకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సి ఉంది.
- విద్య, వైద్య, పశువైద్యరంగాల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి వైద్య సేవలు, సిబ్బంది సమయపాలన పట్టించుకోవడంలేదు. పశువైద్యశాలల్లో మందుల కొరత వెంటాడుతోంది. వసతి గృహాల ప్రక్షాళన జరగలేదు. గతంలో ఉన్న అధికారులే పాలన సాగిస్తుడడంతో అవినీతి, అక్రమాలు తగ్గడంలేదు. గతంలో లేని విధంగా తాజాగా నుంచి బీసీ వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి నెల వారీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని ప్రజాప్రతినిధులు అధికారులతో సమీక్షించడం, పాలనను గాడిలో పెట్టే చర్యలు చేపట్టలేదు. కనీసం జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో సమీక్ష చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

సమావేశానికి హాజరుపై అనుమానం

సమావేశానికి హాజరుకావాల్సిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మంత్రివర్గ సమావేశం కారణంగా రాలేకపోతున్నారు. జడ్పీ సీఈవో ఓబులమ్మ సైతం హైకోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉన్నందున విజయవాడకు వెళుతున్నారు. సీపీడబ్ల్యూ పథకాల గుత్తేదారు న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కలెక్టరు పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ హాజర వుతున్నారు. వైకాపా అధినేత జగన్ బద్వేలు పర్యటన నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు అక్కడికి వెళ్లే అవకాశం ఉంది. దీంతో పలువురు కార్యక్రమానికి గైర్హాజరయ్యే అవకాశం ఉంది.

వంతెన కింద జలం... ఇబ్బందుల్లో జనం!



రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట పంచాయతీ రామయ్య పాలెం గిరిజన కాలనీకి వెళ్లే దారిది. ఇక్కడ పదేళ్ల కిందట రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించారు. వర్షం కురిసిన ప్రతిసారీ వంతెన కింద నుంచి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు ఊటనీరు వంతెన కిందకు చేరుతుండడంతో రాకపోకలు నిలిచి పోతున్నాయి. వర్షాలు కొనసాగితే జనవరి, ఫిబ్రవరి నెల వరకు ఇదే పరిస్థితి. రామయ్యపాలెం, నారాయణరాజుపోడు, హరిజనవాడ తదితర ప్రాంతాలకు చెందిన రైతులకు వంతెన ఎగువన పంట పొలాలుండడంతో బొజ్జావారిపల్లె మీదుగా సుమారు ఐదారు కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి ఉంది. ఈ పరిస్థితి తమకెంతో ఇబ్బందికరంగా మారుతోందని, వంతెన నిర్మించకపోయినా బాగుండేదని నిట్టూరుస్తున్నారు. -న్యూస్‌టుడే, రైల్వేకోడూరు

తుపాకీ కాల్పులు జరిపిందెవరు?

కేసు విచారణకు రెండు పోలీసు బృందాలు

ధర్మవరం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన తుపాకీ కాల్పుల ఘటనపై ప్రత్యేక పోలీసు బృందం హైదరాబాద్‌కు వెళ్లింది. పట్టపగలు జాతీయ రహదారిపై బస్టాప్ వద్ద కాల్పుల ఘటన జరగడాన్ని పోలీసు యంత్రాంగం తీవ్రంగా పరిగణించింది. అనంతపురం జిల్లా వీరాపురం మండలం శికారిపాలెంకు చెందిన ముఠా సభ్యుడు కొమరి బంగారి బత్తలపల్లి పోలీసులకు పట్టుబడ్డాడు. కాల్పులు జరిపింది హైదరాబాద్‌కు చెందినవారని విచారణలో బంగారి తెలపడంతో పోలీసులకు కీలక సమాచారం దొరికింది. గుప్తనిధుల వేటకు, తక్కువ ధరకే బంగారు నాణేలు, ఇతర ఆభరణాలు ఇప్పిస్తామని శికారిపాలెం ముఠా ఎందరో డబ్బు తీసుకుని మోసగిస్తున్నట్లు గుర్తించారు. కొమరి బంగారితోపాటు రాజా రోజ్, జలాల్, రాజా హరీష్ ఇలా... తెలంగాణలోని పలువురిని బంగారం పేరుతో మోసగించినట్లు తేలింది. శికారిపాలెం ముఠాపై తుపాకీ కాల్పులు జరిపిన వ్యక్తులు హైదరాబాద్‌కు చెందినవారిగా సమాచారం లభించింది. వారు మరో ముఠాకు చెందినవారుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో హైదరాబద్‌కు చెందిన ఓ యూట్యూబర్ ఉన్నట్లు తెలిసింది. కేసు దర్యాప్తునకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు రెండు పోలీసు బృందాలు వెళ్లాయి. కాల్పులు జరిపి పరారైనవారు సైబర్ క్రైమ్ పోలీసులమని చెప్పి పోలీసులను పక్కదారి పట్టించారు. ఘటన జరిగి మూడ్రోజులు గడిచినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. మరోవైపు శికారిపాలెం ముఠాకు చెందినవారూ పరారీలో ఉండడంతో పోలీసులు గాలిస్తున్నారు.

సిబ్బంది లేక రోగులకు ఇబ్బంది

- వెంటాడుతున్న ఎఫ్ఎన్‌వోల కొరత
- కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిస్థితి



రోగిని స్కానింగ్‌కు స్ట్రెచ్చర్‌పై అతి కష్టం మీద తీసుకెళ్తున్న బంధువు

–న్యూస్‌టుడే, సర్వజన ఆసుపత్రి

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎఫ్ఎన్‌వో (మహిళా నర్సింగ్ సిబ్బంది) కొరత వేధిస్తోంది. దీంతో ఓపీ, ఐపీ విభాగాలకు వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణంగా వార్డుల్లో చికిత్స పొందుతున్న మహిళలకు వైద్యం కాకుండా మిగిలిన అన్ని సేవలూ ఎఫ్ఎన్‌వోలు అందించాలి. ఆసుపత్రిలో మహిళా రోగుల వార్డులు దాదాపు 23 ఉండగా, మొత్తం ఎఫ్ఎన్‌వోలు 26 మంది మాత్రమే ఉన్నారు. వారు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు విడతల్లో పనిచేయాల్సి ఉంది. శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి డ్రెస్సింగ్, దుస్తుల మార్పు, బెడ్ మేకింగ్, ఎక్స్‌రే, స్కానింగ్, ఈసీజీ, టుడీఎకోకు తీసుకెళ్లడం, వేరే వార్డులకు మార్చడం తదితర పనులు చేయాల్సి ఉంటుంది. సిబ్బంది తక్కువగా ఉండటంతో ఉదయం ఓపీ, ఐపీకి 16 మంది, మధ్యాహ్నం ఐపీకి అయిదుగురు, రాత్రి ఐపీకి అయిదుగురు మాత్రమే వార్డుల్లో సేవలందిస్తున్నారు. దీంతో వార్డుల్లో రోగులకు ఒక్కరు కూడా అందుబాటులో ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్కానింగ్, ఎక్స్‌రేకి వెళ్లాలంటే రోగుల బంధువులే స్ట్రెచ్చర్, చక్రాల కుర్చీలో అతి కష్టం మీద తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



వార్డులోని రోగిని స్కానింగ్ కోసం చక్రాల కుర్చీలో తీసుకెళుతున్న బంధువులు

పెరిగిన రోగుల సంఖ్య : గతేడాదిగా ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరిగింది. గతంలో రోజుకు 800 నుంచి 1200 వరకు వస్తే ప్రస్తుతం ఆ సంఖ్య 2000 నుంచి 2500లకు పెరిగింది. ఇలాంటి సందర్భంలో రోగులకు సరైన సేవలందాలంటే ఎఫ్ఎన్‌వోల సంఖ్య దాదాపు 50కు పెంచాల్సిన అవసరముందని వైద్యులే చెబుతున్నారు. ప్రస్తుతం సగం మంది కూడా లేకపోవడంతో బంధువులే రోగులకు అన్నీ చేయాల్సి వస్తోంది. ఈ విషయమై ఎఫ్ఎన్‌వోల బాధ్యులు, ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 ఇందిర మాట్లాడుతూ సరిపడా ఎఫ్ఎన్‌వోలు లేరని, ఉన్నవారినే సర్దుబాటు చేస్తున్నామన్నారు. ఒక్కోసారి రెండు వార్డులకు ఒక్కరే పనిచేయాల్సి వస్తోందని, సిబ్బంది అవసరమని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.



రహదారి పక్కన నిలిపిన విద్యుత్తు బస్సు

పంక్చర్ దుకాణంలో నట్లు బిగిస్తున్న సిబ్బంది →



ఆర్టీసీ విద్యుత్తు బస్సుకు తప్పిన పెను ప్రమాదం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఆర్టీసీ విద్యుత్తు బస్సుకు పెను ప్రమాదం తప్పింది. నిర్వహణ సరిగా లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... కడప నుంచి తిరుపతికి మంగళవారం ఆర్టీసీ శీతల విద్యుత్తు బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. మార్గమధ్యలో మాధవరం వద్దకు వెళ్లగానే బస్సు వెనకాల టైరు నట్లు లూజయ్యాయి. డ్రైవర్ గమనించకుండా అలానే వెళ్తున్నారు. అదే సమయానికి ఆ బస్సు పక్కన వెళ్తున్న కారులోని ప్రయాణికులు గుర్తించి, వెంటనే విషయాన్ని డ్రైవర్‌కు చెప్పారు. దీంతో రోడ్డు పక్కనే నిలిపివేయడంతో ఒక్కసారిగా ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. టైర్లు బాగున్నాయా, నట్లు బాగున్నాయా అని చూసుకోకుండా బస్సు ఎలా నడుపుతున్నావంటూ డ్రైవరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీపంలోని టైరు పంక్చర్ దుకాణం వద్దకు బస్సును తీసుకెళ్లి నట్లను బిగించడంతో తిరిగి బయలుదేరింది. ఒక వేళ కారులోని ప్రయాణికులు గమనించకపోతే భారీ ప్రమాదం జరిగి ప్రాణ నష్టం సంభవించేది. ఈ విషయమై ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ శీతల విద్యుత్తు బస్సులకు కడపలో ఛార్జింగ్ మాత్రమే పెడతారని, వాటి నిర్వహణ తిరుపతిలోని విద్యుత్తు బస్సుల ఏజెన్సీ వాళ్లు చూస్తారని, విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

ప్రతి నీటిచుక్కనూ ఒడిసిపడదాం!

- మండలానికి వెయ్యి ఇంకుడు గుంతల తవ్వకానికి నిర్ణయం
- వైఎస్ఆర్‌లో 35 వేలు, అన్నమయ్యలో 30 వేలు లక్ష్యం

వర్షపునీటిని ఒడిసిపట్టాలి. భూమిలోకి ఇంకించాలి. పుడమి ఒడిలో భద్రంగా దాచిపెట్టాలి. గంగ బెంగ తీరాలి. జలశోకం రూపుమాపేలా ఇంకుడు గుంతలు తవ్వించాలని ఎన్డీయే ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ప్రజాభాగస్వామ్యంతో మహోద్యమం దూకుడుగా సాగించాలని నిర్ణయించింది. తాజాగా జిల్లాల వారీగా లక్ష్యాలు నిర్దేశించింది. క్షేత్రస్థాయిలో నరేగా పద్దు ఖర్చు చేయాలని పచ్చజెండా ఊపింది.

–న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం

వైఎస్ఆర్ జిల్లాలో 35, అన్నమయ్య జిల్లాలో 30 మండలాలున్నాయి. ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో మండలంలో వెయ్యి చొప్పున ఇంకుడు గుంతల తవ్వకానికి రెండు రోజుల కిందట రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులందాయి. ఒక్కో గుంత పొడవు వెడల్పు లోతు 1.20 మీటర్లు ఉండాలని నమూనా ఆకృతి పంపించారు. ఎన్ని సెం.మీ. పెద్ద, చిన్న రాళ్లు, కంకర ఎంత పరిమాణంలో వాడాలో సూచించారు. ఇందుకోసం పనులు చేసిన కూలీల వేతనాలకు రూ.550, సామగ్రి కొనుగోలుకు రూ.5,450 ఖర్చు చేయాలని అనుమతిచ్చారు. ఈ లెక్కన రెండు జిల్లాల్లో కలిపి సుమారు రూ.39 కోట్లకు పరిపాలన అనుమతిచ్చారు. నరేగా విభాగంలో పనిచేస్తున్న క్షేత్ర, సాంకేతిక సహాయకులు, ఈసీ, ఏపీవో, ఏపీడీ, ఎంపీడీవోలు ప్రణాళికను సిద్ధం చేసి వెంటనే పనులకు శ్రీకారం చుట్టాలని ఆదేశించారు. వాననీటిని ఒడిసిపట్టేందుకు ప్రతిఒక్కరూ భగీరథుడిలా పనిచేయాలని ఉత్తర్వులిచ్చారు.



ఒంటిమిట్ట మండలం సాలాబాద్‌లో నిర్మించిన ఇంకుడుగుంత

వీధుల్లో నీరు ఎక్కువగా నిలిచే ప్రదేశాలను గుర్తించి ఇంకుడు గుంత తవ్వించాలని ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి. మురుగు సమస్య ఉన్న ప్రాంతాల్లోనూ పనులు చేపట్టాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం

జిల్లాలో ఇంకుడు గుంతల తవ్వకంపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ప్రజల భాగస్వామ్యంతో జలస్ఫూర్తితో తవ్వించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. ప్రతి మండలంలో వెయ్యి తవ్వాలని ఉన్నతాధికారులు అనుమతిచ్చారు. నిర్దేశిత లక్ష్యాన్ని వచ్చే ఏడాది జనవరి 15వ తేదీలోగా పూర్తిచేస్తాం.

- విజయ్‌కుమార్, ఇన్‌ఛార్జి పీడీ, నీటి యాజమాన్య సంస్థ, కడప

నవమి బ్రహ్మోత్సవాలకు ప్రణాళికలు సిద్ధం చేయండి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో వచ్చే ఏడాది నిర్వహించే శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి చేపట్టనున్న పనులకు వెంటనే ప్రణాళికలను సిద్ధం చేయాలని తితిదే తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారి వి.వీరబ్రహ్మం పేర్కొన్నారు. రామయ్య క్షేత్రం ఉత్సవాలపై తిరుపతి పరిపాలన భవనంలో జేఈవో మంగళవారం అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. భక్తులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. రాములోరి సన్నిధి, మాడ వీధులు, విశ్రాంతి భవనం, పుష్కరిణి, కల్యాణ వేదిక ప్రాంతంలో ఇంకా ఎలాంటి సదుపాయలు కల్పించాల్సిన అవసరం ఉందని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎస్ఈ మనోహర్, ప్రత్యేకాధికారి ప్రశాంతి, ఈఈ సుమతి, డీఈ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప విద్య, న్యూస్‌టుడే : ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య డిమాండు చేశారు. స్థానిక పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. జడ్పీపీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్ బకాయిలు, ఏపీజీఎల్ఐ, జడ్పీపీఎఫ్ తుది చెల్లింపులు, డీఏ అరియర్స్, సరెండర్‌లీవ్ బకాయిలు, విశ్రాంత ఉపాధ్యాయులకు ఈఈఎల్, జీఐఎస్ చెల్లించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటశివారెడ్డి మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను నాన్‌రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని సూచించారు. సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ తిరుపాల్ మాట్లాడుతూ సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంటును ప్రతి నెలా ఉద్యోగుల ఖాతాలకు జమచేయాలన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, రామమూర్తి, నరసింహులు, రామాంజనేయులరెడ్డి, శ్రీనివాసులు, హరినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జలవనరులకు మహర్దశ!

సాగునీటి సంఘాలకు ఎన్నికల ప్రకటన జారీ చేసిన ప్రభుత్వం

జిల్లాలోని జలవనరుల బాగోగులను గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. నదులు, చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు, సాగునీటి కాలువల మరమ్మతులకు నిధులు విదల్చలేదు. గత అయిదేళ్లుగా చిన్నపాటి మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. సాగునీటి కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పంటపొలాలకు సాగునీరందే పరిస్థితి లేకుండా పోయింది. ప్రధానంగా జిల్లాలో పాపఘ్ని, చెయ్యేరు, మాండవ్య, పింఛ, బాహుదా, పెన్నా నదులుండగా, వీరబల్లి మండలంలోని కోమటివారిచెరువు, రాజంపేటలోని పోలిచెరువు, చిట్వేలిలోని యల్లంరాజుచెరువు, లక్కిరెడ్డిపల్లెలోని దిన్నెపాడు చెరువు, ఒంటిమిట్ట చెరువు, మట్లిరాజులు నిర్మించిన చెరువులు అత్యంత ప్రాచీనమైనవి. వీటి కింద వేలాది ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. ఒక్కో చెరువు కింద నాలుగైదు పంచాయతీల పరిధిలోని పంటపొలాలకు సాగునీరందుతోంది. ఇంతటి ప్రాధాన్యం గల చెరువుల నిర్వహణకు వైకాపా ప్రభుత్వం గత అయిదేళ్లలో పైసా నిధులు వదిల్చిన పాపాన పోలేదు. ఎన్డీయే సర్కారు జలవనరుల సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ భూగర్భజలాల వృద్ధికి తోడ్పాటు నందించనుంది. చెరువులు, కుంటలే కాకుండా భూసారం పెంచే గట్లు, చెక్‌డ్యాంల నిర్మాణానికి శ్రీకారం చుట్టనుంది.

సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, సాగునీటి కాలువలను బాగుచేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత తెదేపా పాలనలో జలవనరుల సంరక్షణకు సాగునీటి సంఘాలుండేవి. వీటిని గత వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలవనరులకు పూర్వ వైభవం రానుంది. సాగునీటి సంఘాలు తిరిగి క్రియాశీలకంగా మారనున్నాయి. సంఘాలకు వచ్చే నెల 21 నుంచి 26వ తేదీ లోగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం తొలిసారి పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొనుంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 164 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాలకు ఎన్నికల నిర్వహణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

-న్యూస్‌టుడే, రాయచోటి, వీరబల్లి

164 సంఘాలకు ఎన్నికలు

కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో పెద్ద, మధ్యతరహా నీటి వినియోగదారుల సంఘాల్లేవు. చిన్న నీటి పారుదల కింద 164 సంఘాలుండగా, వీటిలో 94 ఉమ్మడి కడప జిల్లా పరిధిలో, 70 సంఘాలు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్నాయి. మధ్యతరహా ప్రాజెక్టులైన వెలిగల్లు, అన్నమయ్య ప్రాజెక్టులుండగా, వెలిగల్లు కింద నీటి వినియోగదారుల సంఘాల్లేవు. మూడేళ్ల కిందట అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో వినియోగదారుల సంఘం లేదు. ప్రతి వినియోగదారుల సంఘం ఆరు ప్రాదేశిక నియోజకవర్గాలు కలిగి ఉంటుంది. 3 ఎగువ, 3 దిగువ ప్రాంతాల ఆయకట్టుదారులు ప్రాతినిధ్యం వహించనున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల మొత్తం ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షణలో కొనసాగనుంది.



మరమ్మతులకు నోచుకోని వీరబల్లి మండలం కోమటివారి చెరువు కట్ట

వైకాపా సర్కారులో నిర్వీర్యం

ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తొలిసారిగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. పంట కాలువల అభివృద్ధి, చెరువులు, కుంటల కట్టల భద్రత, సాగునీటి సరఫరా తీరుతెన్నులు పర్యవేక్షించడం సంఘాలదే బాధ్యత. 2015లో తెదేపా ప్రభుత్వ హయాంలో సంఘాలకు చివరి సారిగా ఎన్నికలు నిర్వహించారు. అనంతరం 2019లో ఎన్నికలు తిరిగి నిర్వహించాల్సి ఉన్నా అప్పటి వైకాపా ప్రభుత్వం ఎన్నికలపై దృష్టి సారించలేదు. సాగునీటి నీటివనరుల నిర్వహణ గాడి తప్పింది. పంట కాలువలన్నీ పూడికలతో నిండిపోయాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టింది.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారణ

పరామర్శించిన ఎమ్మెల్యే అధికారులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: రామసముద్రం మండలంలోని ఓ విద్యాలయంలో చదువుతున్న ఇంటర్ విద్యార్థిని పాఠశాలలోనే పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం విదితమే. ఈ విద్యార్థిని ప్రస్తుతం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీనిపై కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాలతో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్, డీఈవో శివప్రకాశ్‌రెడ్డి విద్యార్థినిని పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులను విషయం అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినికి ప్రైవేటు కళాశాలలో చదవాలన్న కోరికని అందుకే పాఠశాలకు వెళ్లను మొండికేస్తే బలవంతంగా తీసుకొచ్చి దింపామన్నారు. విద్యార్థిని సోదరి కూడా ఇదే విద్యాలయంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోందని ఇద్దరూ తోడుగా ఉంటారని చేర్పించినట్లు వారు తెలిపారు. అనంతరం విద్యార్థినికి ధైర్యం చెప్పారు. ఆత్మహత్యాయత్నం యత్నించిన విషయం తెలుసుకున్న మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మంగళవారం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శించారు. ఆమెకు ధైర్యం చెప్పి మరోసారి ఇలా చేసుకోకూడదని చెప్పారు. ఏమైనా అవసరం ఉంటే తనను సంప్రదించాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆయనతో పాటు డీఈవో, ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, రామసముద్రం ఎంఈవోలు హేమలత, ఆంజనేయులు, రూటా రాష్ట్ర నాయకులు మహమ్మద్‌ఖాన్‌లు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పక్కన డీఈఓ, అధికారులు

విచారణ చేపట్టాలని ఆందోళన

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం మండలంలోని విద్యాలయంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవకుమార్, గర్ల్స్ కోఆర్డినేటర్ గంగరాణి డిమాండు చేశారు. విద్యాలయం ఎదుట మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడితే అక్కడి అధ్యాపకులు, ప్రత్యేక అధికారిణి ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. మెనూ ప్రకారం భోజనం, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సంఘ నాయకులు ఆదర్శ్, ఇలాహి, రాజేష్, వంశీ, చరిత, శిరీష, నవ్య, నీతూశ్రీ తదితరులు పాల్గొన్నారు.



విద్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

సుండుపల్లి, న్యూస్‌టుడే : విద్యార్థులు బాగా చదివి నూరు శాతం ఉత్తీర్ణతతో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి జయప్రకాష్(ఎఫ్ఏసీ) పేర్కొన్నారు. సుండుపల్లి, జి.కె.రాచపల్లి ఎస్సీ వసతి గృహాలను మంగళవారం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. సమయం కేటాయించుకుని అభ్యసనం చేయాలన్నారు. వసతిగృహంలో నాణ్యమైన భోజనం, మెనూ పాటిస్తున్నారా అని ఆరా తీశారు. వంటగదులను పరిశీలించి దస్త్రాలను తనిఖీ చేశారు. వసతిగృహ సంక్షేమ అధికారి రెడ్డెయ్య పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న బాధ్య జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి జయప్రకాష్

సర్వేని అడ్డుకున్న గ్రామస్థులు

వీరబల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మట్లి ఎగువరాచచెరువు సమీపంలోని మునక ప్రాంతాన్ని అండదండలున్న కొందరు పట్టా చేసుకోవడంపై పత్తిరాజుగారిపల్లి, పుల్లంరాజుగారిపల్లికి చెందిన గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. సర్వే చేయడానికి వచ్చిన వీఆర్వో మహబూబ్‌బాషాను, సర్వేయర్ దామోదర్‌ను అడ్డుకుని వెనక్కి పంపారు. తమకు చెరువు పైభాగంలో పట్టాలున్నాయని తమ కింద భూమి తమకే దక్కుతుందని ఇతరులకు పట్టా ఎలా ఇస్తారని వాగ్వాదానికి దిగారు. ఖాళీగా ఉంటే పశువులను మేపడానికి ఉపయోపడుతుందన్నారు. ఓ మహిళ తమకు పట్టా ఇచ్చారని కొలవడానికి ప్రయత్నించగా వీలు లేదని అడ్డుకున్నారు. తమకు తెలియకుండా చెరువు మునక ప్రాంతాన్ని ఎలా చేయించుకుంటారని ఘర్షణ పడ్డారు. దీంతో సర్వే చేయకుండా రెవెన్యూ అధికారులు వారి వాగ్మూలం తీసుకుని వెళ్లి పోయారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళుతున్నట్లు వారు పేర్కొన్నారు.



అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్థులు

ఆలస్యంగా నడిచిన ప్యాసింజరు రైలు

ములకలచెరువు, న్యూస్‌టుడే: తిరుపతి నుంచి గంతకల్లు జంక్షన్ వెళ్లే ప్యాసింజర్ రైలు మంగళవారం తెల్లవారుజామున ఆలస్యంగా నడిచింది. ఈ ప్యాసింజర్ రైలు తిరుపతి నుంచి పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, మదనపల్లె మీదుగా ములకలచెరువుకు అర్ధరాత్రి 1.49 గంటలకు రావాల్సి ఉండగా తెల్లవారుజామున 4.57 గంటలకు వచ్చింది. సుమారు మూడు గంటల పాటు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రైల్వేస్టేషన్‌లలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వీర్‌గాథ 4.0!

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు శ్రీకారం

పోటీల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు

- న్యూస్‌టుడే, కడప విద్య

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా వీర్‌గాథ 4.0 పోటీల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పోటీలు నిర్వహించనుంది. రక్షణ, విద్యామంత్రిత్వశాఖలు సంయుక్తంగా పోటీలకు సంబంధించి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌కు ఆదేశాలు జారీ చేసింది. తొలుత పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి వీర్ గాథ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. గ్యాలంట్రీ అవార్డు గ్రహీతల్లైన సైనిక వీరుల ధైర్య సాహసాలు, త్యాగాలు, జీవితగాథలను నేటి విద్యార్థులకు పరిచయం చేయడానికి పోటీలు నిర్వహించనున్నట్లు వెబినార్ ద్వారా వివిధ సెషన్లలో దృశ్యరూపకంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. ఈ మేరకు ఏర్పాట్లు చేసింది.



బద్వేలు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల తరగతి గదిలో విద్యార్థులు

కేటగిరీల వారీగా విద్యార్థులకు నిర్వహించే పోటీలు

కేటగిరి	తరగతులు
1	3, 4, 5
2	6, 7, 8
3	9, 10
4	ఇంటర్మీడియట్

ఎంపిక ఇలా

జిల్లాస్థాయిలో నవంబరు 10వ తేదీ వరకు, రాష్ట్రస్థాయిలో నవంబరు 12 నుంచి 30వ తేదీ వరకు, జాతీయ స్థాయిలో డిసెంబరు 4 నుంచి 24వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నారు. సీబీఎస్ఈ పాఠశాలలు మినహా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరూ అర్హులే. అక్టోబరు 31వ తేదీలోగా పాఠశాల స్థాయిలో కవితలు, వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు జరపాల్సి ఉంటుంది. ప్రతి కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచిన ఎంట్రీ (మొత్తం 4 ఎంట్రీలు) ప్రధానోపాధ్యాయుడు మైగౌ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులు జిల్లాస్థాయిలో మొదటి నలుగురిని, రాష్ట్రస్థాయిలో మొదటి 8 మందిని, జాతీయ స్థాయిలో మొదటి వంద మందిని (సూపర్ 100) ఎంపిక చేసి రానున్న గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తారు. వీరిని సూపర్ 100 విజేతలుగా పిలుస్తారు. ఇందులో 3 నుంచి 5వ తరగతి వరకు 25 మందిని, 6 నుంచి 8వ తరగతి వరకు 25 మందిని, 9, 10 తరగతులకు చెందిన 25 మంది, ఇంటర్మీడియట్‌కి చెందిన 25 మందిని మొత్తంగా వంద మందిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోని విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తారు. జాతీయస్థాయి విజేతలకు రక్షణ, విద్యామంత్రిత్వ శాఖలు రూ.10 వేలు చొప్పున నగదు అందజేస్తాయి.

విభాగం	సంఖ్య	విద్యార్థులు
ప్రాథమిక	1,735	47,580
ప్రాథమికోన్నత	162	12,169
ఉన్నత	304	82,210
హైస్కూల్‌ప్లస్, ఆదర్శ, వసతిగృహాలు	25	10,140
జూనియర్ కళాశాలలు	145	28,380

విద్యార్థులకు మంచి అవకాశం



విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు, వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇదొక చక్కటి అవకాశం. విజేతలకు నగదు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు ప్రదానం చేస్తారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

- మడితాటి నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, జడ్పీ ఉన్నత పాఠశాల, సంబేపల్లి, అన్నమయ్య జిల్లా

11 వేల మంది నమోదు

జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు వీర్‌గాథలో పాల్గొనేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు పంపాం. జిల్లాకు ఓ సమన్వయకర్తను నియమించాం. ప్రతి మండలం నుంచి పది వేల మంది విద్యార్థులు పాల్గొనేలా చూడాలనేది లక్ష్యం. ఇప్పటికే 11 వేల మంది నమోదయ్యారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చే విధంగా విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నాం.

- శివప్రకాశ్‌రెడ్డి, డీఈవో, అన్నమయ్య జిల్లా

రోడ్డు ప్రమాదంలో ఐదుకు చేరిన మృతులు

చికిత్స పొందుతూ మరో మహిళ మృతి



తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి సారా



దిల్షాద్ (పాత చిత్రం)

కలకడ, న్యూస్‌టుడే: చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులతో పాటు అమ్మమ్మను కోల్పోయి మృత్యుంజయురాలుగా నాలుగేళ్ల సారా బయటపడింది. ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన దిల్షాద్ రోడ్డుపై పడి ఉండగా ఆ చిన్నారి తన తల్లిపై పడుకొని లేవమని గట్టిగా తట్టిన లేవలేదు. తీవ్ర గాయాలతో ఉన్న దిల్షాద్‌ను కుటుంబ సభ్యులు, పోలీసులు ప్రథమ చికిత్స కోసం మహల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి సూచన మేరకు గాయపడిన దిల్షాద్‌తో పాటు తాత ఏహసానుల్లాను తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం దిల్షాద్ మృతి చెందారు. చిన్నారి సారా తండ్రి ఖాదర్‌వల్లీ మహల్ స్థలంలోనే మృతి చెందగా తల్లి చికిత్స పొందుతూ దుర్మరణం పాలైంది. తాత ఏహసానుల్లా ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు కలకడ సీఐ గురునాథ్, ఎస్.ఐ. రామాంజనేయులు కేసు నమోదు చేసి, మృతదేహాలకు శవపంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ఆసుపత్రి వద్ద మిన్నంటిన రోదనలు

పీలేరు గ్రామీణ: కలకడ మండలంలో సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మంగళవారం చికిత్స పొందుతూ మరొకరు చనిపోవడంతో ప్రమాద మృతుల సంఖ్య ఐదుకు చేరింది. అదే రోజు రాత్రి మృతదేహాలను పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పీలేరు ఆసుపత్రి వద్ద మృతుల బంధువులు, ఆత్మీయులు, స్నేహితులు ఆసుపత్రి వద్ద చేరుకున్నారు. శవాగారం వద్ద విగత జీవులుగా పడి ఉన్న బంధువులను చూసి విలపించారు. వీరి రోదనలు చూపరులను సైతం కంటతడి పెట్టించాయి. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని, పీపీ సత్యనారాయణ, కలికిరి మండల తెదేపా నాయకుడు నిజాముద్దీన్ ద్వారా అందజేసి ఉదారతను చాటుకున్నారు.



పీలేరు ఆసుపత్రి వద్ద శోకసంద్రంలో మృతుల బంధువులు

ఎంపీ మిథున్‌రెడ్డి బెయిలు పిటిషన్లపై ముగిసిన వాదనలు

ఈ నెల 29న నిర్ణయం వెల్లడిస్తామన్న హైకోర్టు

ఈనాడు, అమరావతి: పుంగనూరు పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసుల్లో ముందస్తు బెయిలు కోసం రాజంపేట వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, మరికొందరు దాఖలు చేసిన వ్యాజ్యాలపై మంగళవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఈ నెల 29న నిర్ణయాన్ని వెల్లడిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ప్రకటించారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన నేతిగుట్లపల్లి, ఆవులపల్లి రిజర్వాయర్ల కోసం సేకరించిన భూముల పరిహారం విషయమై వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన తమపై ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు దాడి చేశారని ఏఎస్ఆర్‌కే ప్రసాద్, సొహైల్ బాషా ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పుంగనూరు పట్టణ పోలీసులు పలువురిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. వాటిలో ముందస్తు బెయిలు కోసం మిథున్‌రెడ్డి, మరికొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఎంపీ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్‌పై తెదేపా కార్యకర్తలు దాడి చేసి తిరిగి ఆయనపైనే తప్పుడు ఫిర్యాదు ఇచ్చారన్నారు. రాజకీయ కారణాలతో పోలీసులు కేసులు నమోదు చేశారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తు బెయిలు ఇవ్వాలని కోరారు.

★ పోలీసుల తరఫున అదనపు పీపీ మర్రి వెంకటరమణ వాదనలు వినిపించారు. పుంగనూరు వెళితే శాంతిభద్రతలకు విఘాతం అని పోలీసులు హెచ్చరించినా ఎంపీ పట్టించుకోలేదన్నారు. దాడులు చేయాలన్న ఉద్దేశంతో ఆయన అనుచరులతో పుంగనూరు వెళ్లారన్నారు. అక్కడికి వెళ్లకుంటే నేర ఘటన జరిగేది కాదని వివరించారు. ఈ దాడుల్లో పలువురు తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఎంపీపై ఇదే తరహా కేసులు ఏడు ఉన్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు. బెయిలు పిటిషన్లను కొట్టేయాలని కోరారు.

27 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలో ఈ నెల 27 నుంచి అండర్-17 కబడ్డీ బాలుర, బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామని జిల్లా విద్యా శాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి.భానుమూర్తిరాజులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కబడ్డీ పోటీల నిర్వహణ పనులను అధికారులతో కలిసి తెదేపా నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి వచ్చే క్రీడాలకారులకు అనువుగా మైదానాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీలలో బాలుర, బాలికలు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంత, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న తెదేపా నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లి, న్యూస్‌టుడే : ముడుంపాడు అటవీ ప్రాంతం మాచిరెడ్డిగారిపల్లి పరిధిలో మంగళవారం ఇద్దరు తమిళ కూలీలను అరెస్టు చేసి తొమ్మిది ఎర్రచందన దుంగలు స్వాధీనం చేసుకున్నామని సానిపాయి రేంజి అధికారి వై.సి.రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో రాయవరం డీఆర్వో రమేష్, ఎఫ్‌బీవో అంజనా స్వాతి, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.



నిందితులు, దుంగలను చూపుతున్న అటవీ అధికారులు

నిబంధనలు పాటించకపోతే చర్యలు

రాజంపేట, న్యూస్‌టుడే: టపాసు విక్రయాల విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ నైదియాదేవి హెచ్చరించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం టపాసు దుకాణదారులతో ఆమె సమావేశం నిర్వహించారు. నిబంధనల మేరకు అనుమతి తీసుకోవాలని, జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాల జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. టపాసులను ఎక్కువ ధరలకు విక్రయిస్తే ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. లైసెన్సుదారులు వారికి కేటాయించిన స్థలాల్లో మాత్రమే విక్రయాలు జరపాలని, ఎక్కుడపడితే అక్కడ దుకాణాలు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నైదియాదేవి

దాడి కేసులో నిందితులకు జరిమానా

పీలేరు గ్రామీణ: మహిళపై దౌర్జన్యం, దాడి కేసులో ఇద్దరు నిందితులకు పీలేరు ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మురళి రూ.6 వేలు జరిమానా విధించినట్లు సీఐ యుగంధర్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని పద్మావతినగర్‌కు చెందిన రత్నకుమారిపై కంభంవారిపల్లె మండలం మద్దిపట్లవారిపల్లెకు చెందిన జయరామయ్య, చెన్నారెడ్డికాలనీకి చెందిన చెన్నారెడ్డి 2012లో దౌర్జన్యంగా ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడి రూ.40 వేలు విలువైన వస్తువులు ధ్వంసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పీలేరు పోలీసులు కోర్టుకు సమర్పించారు. పీపీ శారద బాధితురాలు తరపు వాదనలు వినిపించారని సీఐ తెలిపారు. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో ఇద్దరికీ జరిమానా లేదా మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని సీఐ వివరించారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని డీఈవో శివప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో ఉన్న వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న సెల్ఫ్ అసెస్మెంట్-2 పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలన్నారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. దుస్తులు, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు అందాయా లేదాని విచారించారు. విద్యార్థులు బాగా చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. సమయానికి పాఠ్యాంశ బోధన పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్‌తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

సేవా పథకం... భవితకు సోపానం

జాతీయ స్థాయి శిక్షణకు ఎంపిక

మదనపల్లె నుంచి హిమాచల్‌కు పయనం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : యువత అన్ని రంగాల్లో రాణిస్తేనే వారికి మంచి గుర్తింపు లభిస్తుంది. ఇప్పటికే చాలా మంది చదువుతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తూ ప్రతిభ చాటుతున్నారు. అలాంటి కోవకు చెందిన వారే మదనపల్లెకు చెందిన ఈ ఇద్దరు విద్యార్థులు. ప్రతి సంవత్సరం భారత ప్రభుత్వ యువజనశాఖ, క్రీడలశాఖ సంయుక్తాధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో రాణిస్తున్న విద్యార్థులను గుర్తించి వారిని జాతీయ స్థాయి అడ్వంచర్ శిక్షణ కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఒక్కో విశ్వవిద్యాలయం నుంచి ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి వారికి 10 రోజుల పాటు హిమాచల్‌ప్రదేశ్‌లో శిక్షణ ఇస్తారు. చాలా అరుదుగా లభించే ఈ అవకాశాన్ని మదనపల్లెకు చెందిన శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థి, శ్రీశ్రీనివాస డిగ్రీ కళాశాల విద్యార్థి దక్కించుకున్నారు. ఈ నెల 30న బయలుదేరి వెళ్లనున్నారు.. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ధర్మస్థలలో అటల్ బిహారీ వాజ్‌పాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనింగ్ అండ్ అలిడ్ స్పోర్ట్స్ విశ్వవిద్యాలయంలో డిసెంబరు 2 నుంచి 11వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమంలో వీరు పాల్గొననున్నారు. వీరు ఈ శిక్షణతో పాటు ప్రీ ఆర్‌డీ శిబిరంలో పాల్గొననున్నారు.



జాతీయ సేవా పథకం కార్యక్రమంలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

నాలుగు రౌండ్లలో రాణించి ఎంపిక



జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో రెండు సంవత్సరాలుగా సభ్యుడిగా ఉన్నాను. ఇప్పటి వరకు పలు శిబిరాల్లో పాల్గొన్నాను. ఇటీవల శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయస్థాయి శిబిరంలో పాల్గొన్నాను. 1,600 మీటర్ల పరుగు పూర్తి చేశాను. మార్చ్‌ఫాస్ట్, ముఖాముఖి పూర్తి చేయడంతో జాతీయ అడ్వంచర్ శిక్షణ శిబిరానికి ఎంపిక చేశారు. కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి, ఎన్ఎస్ఎస్ అధికారి రెడ్డెప్పతో పాటు అధ్యాపకులు ఇచ్చిన శిక్షణతోనే సాధించాను.

- చిరంజీవి, బీసీఏ ఫైనలియర్, మదనపల్లె

యువతకు మంచి అవకాశం



రెండు సంవత్సరాల క్రితం ఎన్ఎస్ఎస్‌లో చేరాను. అప్పటి నుంచి కళాశాల ఆధ్వర్యంలో ఎలాంటి కార్యక్రమం జరిగిన అందులో పాల్గొంటున్నాను. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాలకు వెళ్లాను. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నాను. కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి రెడ్డిశేఖర్‌ల ప్రోత్సాహంతోనే ఎంపిక అయ్యాను.

- డి.హేమంత్, బీకామ్ రెండో సంవత్సరం, శ్రీ శ్రీనివాస డిగ్రీ కళాశాల, మదనపల్లె

అద్దె బకాయిలు చెల్లించాలని ఆందోళన

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రభుత్వ అధికారులకు ఏర్పాటు చేసిన వాహనాల అద్దె బకాయిలు చెల్లించాలని నవయువ కారు డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ సాహెబ్‌వల్లి, వాహబ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో గత సార్వత్రిక ఎన్నికల్లో వాహనాలను అద్దెకు నడపడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి తమకు అద్దె బిల్లులు మంజూరు కాలేదని, దీంతో వాహన డ్రైవర్లు, యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ విషయంపై ఎంవీఐతో పాటు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, రిటర్నింగ్ అధికారులను కలవాలని చెప్పారన్నారు. దీనిపై విచారించి తమకు అందాల్సిన అద్దె బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, డ్రైవర్లు, వాహన యజమానులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న డ్రైవర్లు, వాహన యజమానులు

కర్మాగారాల లైసెన్సు రుసుం చెల్లించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలోని కర్మాగారాల నిర్వాహకులు 2025 సంవత్సరానికి లైసెన్సు ఫీజులు వెంటనే చెల్లించాలని జిల్లా ఉప కర్మాగారముల తనిఖీ అధికారి కృష్ణమూర్తి పేర్కొన్నారు. హెడ్ ఆఫ్ అకౌంట్, డీడీవో కోడ్‌లలో ఎటువంటి మార్పు లేదన్నారు. కర్మాగారం పేరు మార్పు ఉన్న ఎడల లైసెన్సుల బదిలీలకు సవరణకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నిర్ణీత లైసెన్సు రుసుం డిసెంబరు 31వ తేదీ లోపు సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించి చలానాను సంబంధిత కర్మాగారముల తనిఖీ అధికారికి అందచేయాలని సూచించారు.

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె



చేనేత మగ్గాలు జలమయం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మారుతీనగర్‌లో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మగ్గం గుంతల్లోకి నీరు చేరడంతో చేనేత కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. చేనేత మగ్గాల నిర్వాహకుడు సుబ్రహ్మణ్యానికి చెందిన మూడు మగ్గాల గుంతల్లోకి నీరు చేరడంతో నేత చీరలు తడిచిపోయాయి. యంత్రాలు కూడా తడవడంతో నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

మగ్గం గుంతలోకి చేరిన వర్షపు నీరు

రైతుబజారు పరిశీలన

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : దళారీ వ్యవస్థ నుంచి రైతులను ఆదుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం రైతుబజారు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మంగళవారం ఆయన రాజీవ్ రైతుబజారును సందర్శించి త్వరలోనే దీన్ని ప్రారంభిస్తామని తెలిపారు. తోపుడుబండ్లపై వ్యాపారం చేసేవారు, రోడ్డుపక్కన చిరు వ్యాపారం చేసుకునే వారు ఇక మీదట గేటు కట్టనవసరం లేదన్నారు. వేలం రద్దు చేసి మళ్లీ వేలం నిర్వహించాలని కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.



రాజీవ్ రైతుబజారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: వైఎస్ఆర్ కాలనీ పంచాయతీ బాబుకాలనీలో రోడ్డుపై చెత్తచెదారం పేరుకుని దుర్వాసన వస్తుంది. దోమలు, ఈగల నిలయంగా మారింది? **- రాజశేఖర్, బాబుకాలనీ**

✓: పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య లేకుండా చూస్తాం. **- మస్తాన్‌వల్లి, ఎంపీడీవో, మదనపల్లె**

?: నక్కలదిన్నె విస్తరణ ప్రాంతంలో చెత్తదిబ్బలతో దోమల నిలయంగా మారింది. పట్టుగూళ్ల పెంపకం కేంద్రం రోడ్డులో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది? **- మహేంద్ర, నక్కలదిన్నె**

✓: చెత్తదిబ్బలు లేకుండా చర్యలు తీసుకుంటాం. **- ప్రమీల, కమిషనర్, పురపాలక సంఘం, మదనపల్లె**

?: రామచర్లపల్లెలోని పాఠశాల వద్ద నిమ్మనపల్లె రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరిగి వాహనదారులకు ఇబ్బందిగా మారింది? ఎదురుగా వచ్చే వాహనాలకు దారిచ్చే క్రమంలో ప్రమాదాలబారిన పడుతున్నారు? **- చలపతి, బసినికొండ**

✓: రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు తొలగించే పనులు చేపడతాం. **- బూరయ్య, ఏఈ, రోడ్లు, భవనాలశాఖ, మదనపల్లె**

?: సొసైటీకాలనీ గేటు వద్ద విద్యుత్తు నియంత్రికల చుట్టూ తీగ మొక్కలు అలుముకుని ప్రమాదకరంగా ఉంది. వర్షాలు కురుస్తున్న ఈ సమయంలో విద్యుదా ఘాతానికి జరిగే సూచనలు ఉన్నాయి. **- రాజేశ్, బెంగళూరు రోడ్డు, మదనపల్లె**

✓: తీగ మొక్కలు తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- అజయ్‌బాబు, ఏఈ, విద్యుత్తుశాఖ, మదనపల్లె**

- న్యూస్‌టుడే, బి.కొత్తకోట

?: బి.కొత్తకోట పట్టణంలోని ఖాజాఖాన్‌వీధి-2లో పారిశుద్ధ్యం లోపించింది. దోమల బెడద నివారణకు సత్వర చర్యలు చేపట్టాలి? **- ఎస్.ఎం.రఫీ, స్థానికుడు**

✓: పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపడుతాం. **- పల్లవి, కమిషనరు, బి.కొత్తకోట నగర పంచాయతీ**

సొసైటీ కాలనీలో సమస్యలు తిష్ఠ

అయిదు రోజులకొకసారి తాగునీరు సరఫరా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ఒకప్పుడు సొసైటీ కాలనీ అంటే ఆహ్లాదకర వాతావరణం... కాలుష్య రహితం, శబ్దాలకు దూరం, పరిశుభ్రతకు చిరునామాగా ఉండేది. ధనవంతులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా పలు ఉన్నత రంగాల్లో ఉన్న వారు ఇక్కడ నివాసం ఉండేందుకు ఆసక్తి చూపేవారు. రోజులు గడిచేకొద్దీ ఇక్కడి పరిస్థితులు భిన్నంగా తయారయ్యాయి. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. దీంతో స్థానికంగా నివాసముంటున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. అధికారులు, పాలకులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ● మదనపల్లె పురపాలక సంఘం పరిధిలోని సొసైటీ కాలనీ చాలా పెద్దది. ఇక్కడ సుమారు 500 గడపలకు పైగా ఉన్నాయి. రోడ్లు విశాలంగా ఉన్నా చాలా వరకు ఆక్రమణలకు గురయ్యాయి. తోపుడుబండ్లు, చిరు వ్యాపారులు రోడ్డుపక్కనే వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ మధ్య వాహనాలు పెరగడంతో శబ్ద కాలుష్యం పెరిగింది. దీనికి తోడు తోపుడు బండ్ల వ్యాపారులు ఉదయాన్నే రికార్డింగ్ చేసిన మైకుల ద్వారా చేసే ప్రచారాలు స్థానికులకు నిద్రపట్టనివ్వడం లేదు. కాలనీలో చాలా వరకు రోడ్లు కంకరతేలి రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. రోడ్డు మలుపుల్లో చెత్తకుప్పలు కంపుకొడుతున్నాయి. నిర్ణీత సమయంలో వీటిని తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు అంటున్నారు. పైగా వీధి కుక్కలు చెత్తకుండీలు రోడ్డుపైకి ఉండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి.



ఆక్రమణకు గురైన కురవ వంక (పాత చిత్రం)

అయిదు రోజులుకొకసారి తాగునీరు : సొసైటీ కాలనీలో 5 రోజులుకొకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీరు చాలక పోవడంతో చాలా మంది ప్రైవేటు ట్యాంకర్ల వద్ద నుంచి నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇక తాగడానికి శుద్ధినీరు 20 లీటర్ల క్యానును రూ.20లకు కొనుగోలు చేస్తున్నారు. సొసైటీ కాలనీని అనుకుని వెళ్తున్న కురవంక ఆక్రమణకు గురైంది. భారీ వర్షాలు వచ్చినప్పుడు ఇళ్లలోకి వరద నీరు చేరుతోంది. మురుగు వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. తేలికపాటి వర్షం వస్తే మురుగు కాలువలు పొంగి మురుగు రోడ్లపైకి వస్తోంది. వీధిదీపాలు పూర్తి స్థాయిలో వెలగడంలేదు. వెలగని వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీలో ఉద్యానవనం ఏర్పాటు చేసినా అందులో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించలేదు.

భారీ వర్షం... లోతట్టు ప్రాంతాలు జలమయం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లె డివిజన్‌లోని పలు మండలాల్లో అల్పపీడన ప్రభావంతో సోమవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. మదనపల్లెలో అత్యధికంగా 70.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా ములకలచెరువులో 41 మి.మీటర్లు, తంబళ్లపల్లెలో 22.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు డీఎస్‌వో శేషయ్య తెలిపారు. మదనపల్లెలో కురిసిన వర్షం కారణంగా మురుగు కాలువలు పొంగి ప్రవహించాయి. రాజీవ్‌నగర్, భవానినగర్, కొత్తిండ్లు విస్తరణ, ఎంఎల్ఎల్ ఆసుపత్రి రోడ్డుపై వర్షపునీరు నిలబడిపోయింది. పోతబోలు, వలసపల్లె పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీల్లో, గ్రామీణ మట్టిరోడ్లు, అంతర్గత కాలనీలు బురదమయంగా మారాయి.



బురదమయంగా మారిన చెంబుకూరు రోడ్డు

కుషావతి పరవళ్లు

పెద్దమండ్యం, న్యూస్‌టుడే: మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మంగళవారం తెల్లవారుజాము నుంచే కుషావతి నది ఉగ్రరూపం దాల్చింది. మంగళవారం మధ్యాహ్నం ప్రవాహం తగ్గింది. మంగళవారం తెల్లవారుజామున ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయాయి.





బీటీ కళాశాల క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, వివిధ శాఖల అధికారులు

సూచించిన ప్రాంతాల్లోనే దుకాణాల ఏర్పాటు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: సూచించిన ప్రాంతాల్లోనే తాత్కాలిక బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేయాలని వ్యాపారులకు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. దీపావళికి సంబంధించి తాత్కాలిక బాణాసంచా దుకాణాల ఏర్పాటుపై స్థలాలు కేటాయించేందుకు మంగళవారం అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ బీటీ కళాశాల క్రీడా మైదానాన్ని, మిషన్ కాంపౌండ్ స్థలాలను పరిశీలించారు. వాహనాల రాకపోకలకు, ట్రాఫిక్‌తో పాటు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు అవసరమైన వాహనాలను, నీరు, ఇసుక తదితర సామగ్రి అందుబాటులో పెట్టే విషయాలపై అగ్నిమాపక కేంద్రం అధికారి శివన్నతో చర్చించారు. వ్యాపారులతో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక కేంద్రం, పురపాలక సంఘం, విద్యుత్తుశాఖ అధికారులు సమన్వయం చేసుకుని తాత్కాలిక దుకాణాలకు అనుమతులు ఇస్తామన్నారు. ప్రస్తుతం అగ్నిమాపకశాఖకు 36 మంది వ్యాపారులు తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు అందజేశారని, వాటిని పరిశీలించి అనుమతులివ్వడం జరుగుతుందని సబ్ కలెక్టర్ చెప్పారు. కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ, సీఐలు చాంద్‌బాషా, రామచంద్ర, విద్యుత్తుశాఖ ఏఈ అజయ్‌బాబు, ఆర్ఐ రెడ్డెప్ప వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐ శిక్షణతో సత్వర ఉపాధి



ఉద్యోగ మేళాలో మాట్లాడుతున్న టీవో నాగరాజు, పక్కన అధికారులు

ములకలచెరువు, న్యూస్‌టుడే: ఐటీఐ కోర్సుల్లో శిక్షణతో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో సత్వర ఉపాధి పొందవచ్చునని తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐ టీవో నాగరాజు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి డీఆర్‌డీఏ సీడాప్ ఆధ్వర్యంలో మంగళవారం తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాకు ముత్తూట్ ఫైనాన్స్, యంగ్ ఇండియా కంపెనీలు హాజరు కాగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 36 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరికి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చూపిన 14 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు.

భూసమస్యలు పరిష్కరిస్తాం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: భూముల రీసర్వేలో ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరిస్తామని బి.కొత్తకోట తహసీల్దారు మహమ్మద్ అన్సారీ తెలిపారు. మండలంలోని కోటావూరు పంచాయతీ అమర నారాయణపురంలో భూముల రీసర్వేపై గ్రామసభను మంగళవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతుల నుంచి 134 దరఖాస్తులు అందాయి. రీసర్వే ముగిసిపోయినప్పటికీ తమకు ఆన్‌లైన్లో వెబ్‌ల్యాండ్ అడంగల్లో రికార్డు కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, క్రయవిక్రయాలు ఆగిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూముల విస్తీర్ణంలో తేడాలను సరిచేయడంతో పాటుగా దొర్లిన తప్పులను సరిదిద్దాలని పలువురు రైతులు కోరారు. దీనిపై తహసీల్దారు స్పందిస్తూ లోపాలను సరిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్‌ఐ వీరాంజనేయులు, సర్వేయరు ఎ.యువరాజ్, వీఆర్వో నరేంద్రబాబు, గ్రామ సర్వేయరు భాస్కర్‌రెడ్డితో పాటు వీఆర్ఏలు ఇందులో పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్లకు నియంత్రికలు

రామసముద్రం, న్యూస్‌టుడే: నూతన వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్న రైతులకు త్వరలోనే విద్యుత్తు నియంత్రికలను పంపిణీ చేయనున్నట్లు మదనపల్లె డిస్కం ఏడీఏ హరికుమార్ తెలిపారు. రామసముద్రం విద్యుత్తు ఉపకేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మండలంలో 750 మంది రైతులకు నియంత్రికలను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. త్వరలోనే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. రామసముద్రంలో వర్షాలకు ఉరుస్తూ శిథిలావస్థకు చేరుకున్న భవన స్థానంలో త్వరలోనే రూ.27 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిస్కం ఏఈ మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న ఎంపీపీ నూర్జహాన్

కలికిరి, న్యూస్‌టుడే: అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమస్యలకు పరిష్కారం చూపాలని మండలాధ్యక్షురాలు నూర్జహాన్ సూచించారు. మంగళవారం కలికిరి మండల సర్వసభ్య సమావేశం నూర్జహాన్ అధ్యక్షతన నిర్వహించారు. గుట్టపాలెం పంచాయతీలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించి రైతుల ఇబ్బందులు తొలగించాలని సర్పంచి వెంకట రెడ్డి కోరారు. సి.బిరిజేపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న విద్యుత్తు ఉపకేంద్రం పనులు పూర్తయితే సమస్య తీరుతుందని ట్రాన్స్‌కో ఏఈ మణికుమార్ రెడ్డి సమాధానమిచ్చారు. మంగళవారం కలికిరి మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రహదారుల్లో గుంతలకు మరమ్మతులు చేసే వారు ఎవరని? అద్దవారిపల్లె సర్పంచి గంగయ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కలికిరి ఆర్‌అండ్‌బీ జేఈని నియమించి రహదారుల్లో గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ఆయన విన్నవించారు. మండలంలోని గుట్టపాలెం యూపీ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని కోరగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని ఎంఈవో ముల్లా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, పరిపాలనాధికారి సురేంద్రబాబు, కో-ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

వాలంటీర్లను కొనసాగించాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: వాలంటీర్లను యథావిధిగా కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. మంగళవారం సంతగేటులోని ఏఐటీయూసీ కార్యాలయంలో వాలంటీర్ల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులను వాలంటీర్లుగా నియమించారని వీరిలో కొందరిని గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో బలవంతంగా రాజీనామా చేయించడం జరిగిందని తెలిపారు. వీరిని యథావిధిగా వాలంటీర్లుగా తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని హామీ ఇచ్చారని, అలాగే రూ.10 వేల వేతనం అందరికీ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా కొనసాగింపుపై స్పష్టత ఇవ్వలేదని ఆరోపించారు. వేతనాలు పెంచి, వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేశ్‌కుమార్, మురళి, వెంకట రమణ, వాలంటీర్లు రాజశేఖర్ నాయుడు, మహేశ్, సురేశ్, బాలాజి, లోహిత్, ప్రభావతి, తులసి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నాయకులు, వాలంటీర్లు

ఉద్యోగాలకు ఎంపిక

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్, సీడ్ అప్ అండ్ డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 46 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, క్రెడిట్ యాక్సిస్ సంస్థల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టాయని ఆయన తెలిపారు. సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ డీఈఈగా అమీర్‌బాషా

పీలేరు, న్యూస్‌టుడే: ఎస్పీడీసీఎల్ పీలేరు డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా అమీర్‌బాషా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇతను చిత్తూరు పరిశ్రమలకు సంబంధించి (హెచ్‌టీ) మీటర్ల తనిఖీ డీఈఈగా పనిచేస్తూ పీలేరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా అమీర్‌బాషా మాట్లాడుతూ... పీలేరు, పీలేరు గ్రామీణ, కంభంవారిపల్లె సెక్షన్ల పరిధిలోని విద్యుత్తు వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరిస్తానని తెలిపారు.

ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్ర గాయాలు

మదనపల్లె నేరవార్తలు : వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం తెట్టు పంచాయతీ పూజారివారిపల్లెకు చెందిన వెంకటరమణ (70), శ్రీరాములువారిపల్లెకు చెందిన దశరథ (57) మంగళవారం ద్విచక్ర వాహనంపై కురబలకోట మండలంలోని అంగళ్లుకు వచ్చారు. అంగళ్లులో వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు వారిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు. ● కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన సదాశివమూర్తి (38), ఇతని భార్య మల్లిక (35), కుమార్తె దీప్తి (8)తో కలసి సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై మదనపల్లెలోని ఆసుపత్రికి వచ్చి తిరిగి వెళ్తుంగా అమ్మచెరువు మిట్ట వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడటంతో స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఒకటో పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కేసు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: రహదారులపై మైనర్లు వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ప్రమాదకరమైన ఫీట్లు చేస్తూ ద్విచక్ర వాహనాలను నడిపిన వారిని మంగళవారం స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. అవగాహన లేకుండా డ్రైవింగ్ చేయడం వల్ల ఇటీవల కాలంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఇప్పటికైనా తల్లిదండ్రులు వాహనాలను తమ పిల్లలకు ఇవ్వవద్దని సూచించారు. కళాశాలల్లో చదువుకునే అమ్మాయిలను కొందరు ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తున్నారని వస్తున్న ఫిర్యాదులపై కఠినంగా వ్యవహరిస్తామని, ఆకతాయిలపై అవసరమైతే పోక్సో కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మత్తు పదార్థాల నివారణ అందరి బాధ్యత

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మత్తు పదార్థాల నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎక్సైజు ఎస్.ఐ. జబీవుల్లా అన్నారు. మంగళవారం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో గ్రామజ్యోతి సొసైటీ, నెహ్రూ యువకేంద్ర సంయుక్తాధ్వర్యంలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాల గురించి ఎలాంటి సమాచారం తెలిసినా తమకు తెలియజేయాలని కోరారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్‌బాబు, గ్రామజ్యోతి సొసైటీ వ్యవస్థాపకురాలు సుభద్ర, డీన్ అకాడమిక్ డాక్టర్ వీవీఎన్ భాస్కర్, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు దర్శన్, గోపి, ఈశ్వర్‌రెడ్డి, పీఈఎస్ సంస్థ నిర్వాహకుడు చంద్రశేఖర్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అసభ్యంగా మాట్లాడటం బాధాకరం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన దళిత సంఘం నాయకుడు రఘు స్థానిక పోలీసు అధికారికి ఫోన్ చేస్తే అసభ్య పదజాలంతో తిట్టడం మాట్లాడటం బాధాకరమని మాల మహానాడు జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు యమలా సుదర్శనం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ విషయమై మాల మహానాడు నాయకులు సమిష్టిగా కలిసి ఆ పోలీసు అధికారిని కలిస్తే సంతృప్తికర సమాధానం చెప్పకపోవడం బాధకరమన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, న్యాయం జరగకపోతే మాల మహానాడు ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభను చాటి... బహుమతులు గెలిచి



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలతో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు

మదనపల్లె విద్య, పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెలో ఉన్న గౌతమ్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో పి.శిరివెన్నెల (10వ తరగతి), కె.భవిత (10వ తరగతి), కె.కౌశల్ సాయి (9వ తరగతి)లు విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లె విద్య, పట్టణం, న్యూస్‌టుడే : 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం మదనపల్లె పట్టణంలోని జ్ఞానజ్యోతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన డి.శిరీషా (10వ తరగతి), పీఎం అర్చనారెడ్డి (9వ తరగతి), ఎం.హేమంత్‌కుమార్ (9వ తరగతి) విద్యార్థులకు ప్రిన్సిపల్ శ్రీరాములు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి, శిరిషా, నజిరుల్లాతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలైన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ శ్రీరాములు, ఉపాధ్యాయులు

ఆ బడి... ఆధ్యాత్మిక ఒడి

- దాతల సాయంతో అభివృద్ధి
- చదువుకు తోడు నైతిక విలువలు

కలికిరి, న్యూస్‌టుడే: చదువుల బడి... వినూత్న ఒరవడి... ధ్యానానికి బుద్ధుడు... విద్యల తల్లి సరస్వతి... ఆది దేవుడైన గణపతి... ఇలా ఆ పాఠశాలలో అడుగు పెట్టగానే ఆధ్యాత్మికత ఉట్టి పడుతుంది. విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించాలన్న లక్ష్యంతో ఉపాధ్యాయులు దాతల సహాయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు ఆధ్యాత్మిక, మానసిక వికాసానికి తోడ్పాటునందిస్తున్నారు. ● మండల కేంద్రం కలికిరి ప్రభుత్వ పాఠశాల, బాలికోన్నత పాఠశాల, మేడికుర్తి ఉన్నత పాఠశాలల్లో దాతల సాయంతో ఆలయం, బుద్ధుని విగ్రహాలను ఆవిష్కరించారు. స్థానిక టీబీ రోడ్డుకు చెందిన శెట్టిపల్లె తిమ్మారెడ్డి, ఎల్లమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సరస్వతీ దేవి ఆలయాన్ని నిర్మించారు. ఈ పాఠశాలలోనే చదువుకుని హైదరాబాదులో వైద్యవృత్తిలో స్థిరపడిన డాక్టర్ ప్రమీల రూ.లక్ష వ్యయంతో ధ్యాన బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. బాలికోన్నత పాఠశాలలో వైద్యుడు శీనయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అంబా ఆయుర్వేదిక్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ మహేంద్రస్వామి దంపతులు సరస్వతీదేవి, వినాయకస్వామి ఆలయాలను నిర్మించారు. మేడికుర్తి ఉన్నత పాఠశాలల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు ఆలయ నిర్మాణానికి తమ వంతు సాయం అందించారు. దీంతో విద్యార్థులకు చదువులతో పాటు ఆధ్యాత్మిక చింతన, ధ్యానం, నైతిక విలువలను నేర్పుతున్నారు.



కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ధ్యాన బుద్ధుడు



పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి, వినాయకస్వామి గుడి


నైతిక విలువలకు అవకాశం



పాఠశాలకు వచ్చే విద్యార్థుల్లో దైవచింతన వల్ల నైతిక విలువలు మెరుగుపడతాయి. దీని ద్వారా తప్పులు చేయరు, అబద్ధాలు మాట్లాడరు. అలా చేస్తే దేవుడు దండిస్తాడన్న భావన వారిలో బాల్యంలోనే నాటుకుపోతుంది. బుద్ధుడిని చూసి మౌనం ద్వారా ఒత్తిడులను జయించడం, ధ్యానంపై దృష్టి పెడతారు. ఈ విగ్రహాల ఏర్పాటు ద్వారా పాఠశాలలో మార్పునకు శ్రీకారం చుట్టాం.

- వెంకట్రమణారెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కలికిరి

చెడుకు దూరంగా జీవనం



రోజూ దేవుడిని ప్రార్థించడం, బుద్ధుడి విగ్రహం వద్ద కొంత సేపు సేద తీరే విద్యార్థులకు మనశ్శాంతి లభిస్తుంది. మనస్సు నిర్మలంగా ఉండడంతో పాటు విద్యపై ధ్యాస పెరుగుతుంది. చిన్నతనం నుంచి దైవభక్తి, బుద్ధుడి సూక్తులు అలవర్చుకుంటే చెడు అలవాట్లు, వ్యసనాలకు దూరంగా ఉండేందుకు అవకాశం కలుగుతుంది.

- శారద, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కలికిరి

అయోడిన్ లోపంతో సమస్యలు

గుర్రంకొండ, న్యూస్‌టుడే : శరీరంలో అయోడిన్ లోపం వల్ల అనేక సమస్యలు వస్తాయని వైద్యాధికారి రవీంద్రనాయక్ పేర్కొన్నారు. మంగళవారం గురుకుల బాలికల పాఠశాల్లో అయోడిన్ లోప నివారణోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ... సూక్ష్మమూలకం లోపం వల్ల అనేక వ్యాధులు సంభవిస్తాయన్నారు. మహిళల్లో గర్భస్రావాలు, బుద్ధిమాంద్యం పిల్లలు పుట్టడం, మూగ, చెముడు, మరుగుజ్జులుగా జన్మించడం సంభవిస్తుందన్నారు. వెంట్రుకలు రాలిపోవడం, నిద్రలేమి, స్థూలకాయం వంటి సమస్యలుంటాయన్నారు. వీటి నివారణకు రోజు వారి ఆహారంలో ముల్లంగి, క్యాబేజీ, కర్రపెండలం, నూలుకోల్, కాలిఫ్లవర్, కోడిగుడ్డు, సముద్రపు చేపలు తక్కువగా ఉండునట్లు చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శిరీషా, ఆరోగ్య విద్యాధికారి రఫీ, పర్యవేక్షకులు నాగరాజ, సిబ్బంది చందన, జయలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

న్యాయమూర్తికి అభినందనలు



న్యాయమూర్తిని అభినందిస్తున్న న్యాయవాదులు

రాజంపేట, న్యూస్‌టుడే: ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆంధ్రా రత్న అవార్డును అందుకున్న రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేటు పసుపులేటి శంకర్‌ను మంగళవారం న్యాయవాదులు అభినందించారు. టి.లక్ష్మీనారాయణ, కృష్ణకుమార్, రమేష్‌నాయుడు, నాగరాజుగుప్త, కాశీవిశ్వనాథ్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండు


రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: బద్వేలుకు చెందిన ఇంటర్ విద్యార్థినిని నిప్పంటించి చంపేసిన నిందితుడు విఘ్నేష్‌ను వెంటనే కఠినంగా శిక్షించాలని మంగళవారం పట్టణంలోని టోల్‌గేట్ వద్ద కళాశాలల విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లెం హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో నిందితుడి దిష్టి బొమ్మను దహనం చేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు.



టోల్‌గేట్ వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

ఆలయ భూముల ఆక్రమణలపై చర్యలకు వినతి

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలోని ఆలయ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిలకు వేర్వేరుగా అమరావతిలో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు తెలిపారు. ప్రముఖ ఆలయాల భూములను గత ప్రభుత్వంలో వైకాపా నాయకులు స్వాహా చేశారని, మరికొందరు తమ ఆధీనంలో పెట్టుకుని సాగు చేసుకుంటున్నారని తెలియజేశారు. దేవాలయాలకు చెందిన భూముల్లో వచ్చే ఆదాయం ఆలయాల అభివృద్ధికి ఖర్చు చేయాలని సూచించారు. అదే విధంగా రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు స్పష్టం చేశారు. అటవీ శాఖలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరినట్లు వివరించారు.



సీఎం చంద్రబాబుకు సమస్యలు తెలుపుతున్న బత్యాల చెంగల్రాయుడు

దస్త్రాల పరిశీలన

సుండుపల్లి, న్యూస్‌టుడే: మండల పరిషత్‌లో నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదు విచారణలో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి మంగళవారం ఎంపీపీ కార్యాలయంలో దస్త్రాలు పరిశీలించారు. అందుబాటులో ఉన్న నగదు పుస్తకాలను తనిఖీ చేశారు. ఎంబుక్కులు కొన్ని క్యాష్ వద్ద, కొన్ని ఆడిట్ తనిఖీలో ఉన్నాయని సిబ్బంది తెలిపినట్లు సమాచారం.

పాత రాయచోటి... సమస్యలతో పోటీ



నివాసాల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఎక్కడ చూసినా సమస్యలే పలకరిస్తాయి. పేరుకే గ్రేడ్-1 మున్సిపాలిటీ అయినా పంచాయతీ స్థాయిలో ఉండాల్సిన వసతులు లేవన్న విమర్శలున్నాయి. పురపాలక పరిధిలో 34 వార్డులు, సుమారు 31 వేల నివాసాలున్నాయి. లక్షా 20 వేల వరకు జనాభా ఉంది. అయితే అన్ని వార్డుల్లోనూ మౌలిక వసతులు మాత్రం అరకొరగానే ఉన్నాయి.

● పట్టణంలోని 32వ వార్డు పరిధిలోకి వచ్చే పాత రాయచోటిలో 2 వేలకు పైగా ప్రజలు నివసిస్తున్నారు. అయితే ఇక్కడ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఎటు చూసినా అపరిశుభ్రం దర్శనమిస్తోంది. అధ్వాన రహదారులు, ఖాళీస్థలాల్లో చెత్త చెదారం పేరుకుపోయి పిచ్చి మొక్కలతో నిండి అడవిని తలపిస్తోంది. పాత రాయచోటికి ఆనుకుని మాండవ్య నది ప్రవహిస్తోంది. భారీ వర్షాలు కురిసినప్పుడు నది పరీవాహక ప్రాంతంలోని నివాసాలు నీట మునుగుతున్నాయి. రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరద కారణంగా పాత రాయచోటిలో నది పరీవాహక ప్రాంతంలోని ఇళ్లు కొట్టుకుపోయాయి. మూగ జీవాలు మృతి చెందాయి. భారీగా ఆస్తి నష్టం జరిగింది. పూర్తి స్థాయిలో నది పరీవాహక ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరొక ప్రధాన సమస్య ఆ పారిశుద్ధ్యం. ఈ ప్రాంతంలో పూర్తి స్థాయిలో కాలువలు లేకపోవడంతో రోడ్లపై మురుగు ప్రవహిస్తూ అపరిశుభ్రత నెలకొంది. అంతర్గత రహదారులు గుంతలమయంగా మారి అధ్వానంగా మారాయి. గత వైకాపా నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ ప్రాంత సమస్యలు పరిష్కరించాలని అధికారులు, పాలకులను స్థానికులు కోరుతున్నారు.



గుంతలమయంగా అంతర్గత రహదారి

మౌలిక వసతులు కల్పించండి



పాత రాయచోటి ప్రాంతం పురపాలక పరిధిలో ఉన్నప్పటికీ మారుమూల పల్లెను తలపిస్తోంది. ఈ ప్రాంతంలో ఎలాంటి మౌలిక వసతులు లేవు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. గుంతలమయమైన మట్టి రోడ్లే దిక్కు. తాగు నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. గత పాలకులు ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వమైనా ఈ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలి. - బండ్లమూడి శేషాద్రి బాబు, పాత రాయచోటి

రక్షణ గోడ నిర్మించాలి



పాత రాయచోటిని ఆనుకుని మాండవ్య నది ప్రవహిస్తోంది. ఈ నది పరీవాహక ప్రాంతంలోని ప్రజలు వర్షాకాలం వచ్చిందంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయాందోళన చెందుతున్నారు. గతంలో కురిసిన వర్షాలతో వచ్చిన వరదలకు చాలా ఇళ్లు దెబ్బతిన్నాయి. పూర్తి స్థాయిలో రక్షణ గోడ నిర్మించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. రక్షణ గోడ నిర్మాణానికి పాలకులు చర్యలు తీసుకోవాలి. - మద్దెల కేశవరావు, పాతరాయచోటి

బాలకార్మిక చట్టాలపై అవగాహన

చిన్నమండెం, న్యూస్‌టుడే: వివిధ రంగాల్లో బాలకార్మికులుగా పెట్టుకొని వారితో పనులు చేయిస్తే కఠిన చర్యలుంటాయని జిల్లా కార్మిక శాఖ ఇన్‌ఛార్జి అధికారి అల్లాబకాష్ పేర్కొన్నారు. చిన్నమండెంలో మంగళవారం తన బృందంతో హోటళ్లు, మెకానిక్ షెడ్లు, ద్విచక్రవాహనాల మరమ్మతుల కేంద్రాలు, స్వీట్, బేకరీ, కిరాణా దుకాణాలను పరిశీలించారు. ఎక్కడా కూడా చిన్న పిల్లలు పనిలో లేరని నిర్ధారించారు. దుకాణాలు నడిపే వారు పిల్లలను పనిలో పెట్టుకొని వెట్టి చాకిరి చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో శైలజ, సురేష్, వెంకటయ్య, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థుల రాణింపు

పుల్లంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, వ్యాయామ ఉపాధ్యాయుడు నీలకంఠేశ్వరరావు తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ అండర్-19 విభాగం తైక్వాండో పోటీల్లో విద్యార్థులు పాల్గొని భార్గవి రజతం, లహరి రజతం, తేజస్విని కాంస్యం పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి, కోఆర్డినేటర్ మునిరత్నం, ఆర్ఎస్ స్పోర్ట్స్ అధినేత రవిశంకర్‌రాజు, కోచ్ మానస, గణేష్ పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో అధ్యాపకులు

తూకాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

పుల్లంపేట: తూనిక కొలతల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తూనిక కొలత అధికారి నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం పుల్లంపేట తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని చౌకదుకాణదారుల తూనిక యంత్రాలను తనిఖీ చేపట్టి తప్పిదాలను సరిదిద్దడం జరిగిందని తెలిపారు. ప్రజలకు అందించే సరకుల తూకాల్లో తక్కువ వస్తున్నట్లు ఫిర్యాదు వస్తే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

సృజనకు పదును

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రైల్వేకోడూరు పట్టణంలోని శ్రీ ధరణి విద్యా నికేతన్‌లో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు-విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీలకు 8, 9, 10వ తరగతుల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఎనిమిదో తరగతికి చెందిన ఎస్. నక్షత్ర, తొమ్మిదో తరగతికి చెందిన సి.లహరి, బి.వర్షిణ్య విజేతలుగా నిలిచారు. కరస్పాండెంట్ ఆర్.నాగరాజు వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ ఆర్.సుకుమార్‌రాజు, ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీ రామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ నాగరాజు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రైల్వేకోడూరు పట్టణంలోని విజ్ఞాన్ అకాడమీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు-విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 8, 9, 10వ తరగతుల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. టి.సాయిశరణ్య (ఎనిమిదో తరగతి), డి.విఘ్నగణేష్ (తొమ్మిదో తరగతి), ఎస్. హైఫ్లా (పదో తరగతి) విజేతలుగా నిలిచారు. కరస్పాండెంట్ పుట్టా శ్రావణి వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ శ్రావణి, ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం

వ్యాస రచనలో సత్తా

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలోని ఎస్‌వీ విద్యామందిర్(సన్‌రైజ్) హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు మంగళవారం నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు-విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీలకు 8, 9, 10వ తరగతుల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన రమాకాంత్‌రెడ్డి (పదోతరగతి), సమీర్ (తొమ్మిదో తరగతి), వెంకట ఆకీల్‌రెడ్డి (ఎనిమిదో తరగతి)లకు ప్రధానోపాధ్యాయుడు రెడ్డెప్పరెడ్డి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిత్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రెడ్డెప్పరెడ్డి

దాడి ఘటనలో నిందితుల అరెస్టు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలో స్థానికులను వ్యాపారాలు పెట్టుకోనీయకుండా ఇబ్బందులు పెడుతూ అడ్డుకుంటున్నారని రాయచోటిలో సెలూన్ కేంద్రాలపై రాళ్ల దాడికి పాల్పడ్డారని డీఎస్పీ కృష్ణమోహన్ పేర్కొన్నారు. రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులో గత ఆదివారం రాత్రి జరిగిన దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. పట్టణంలోని మదనపల్లె రోడ్డు శివాలయం బైపాస్ వద్ద సెలూన్ షాప్ నిర్వహిస్తున్న రవి, అక్కడే పని చేస్తున్న రెడ్డెప్రసాద్, తులసి ప్రసన్నలు కలిసి ఐదేళ్లుగా వ్యాపారం చేసిన రెండు సెలూన్ దుకాణంలపై రాళ్లతో దాడి చేశారని వివరించారు. దుకాణాల్లోకి దూరి అక్కడి వారిని భయాందోళనకు గురి చేయడమే కాకుండా రూ.7 లక్షల విలువైన సామగ్రిని ధ్వంసం చేశారన్నారు. కేవలం దుకాణాలు నడపకుండా చేయాలన్న ఉద్దేశంతోనే ఈ దాడికి పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. దాడికి పాల్పడిన వారిని మంగళవారం సత్యనారాయణస్వామి ఆలయం వద్ద పట్టణ సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరసింహారెడ్డిలు అరెస్టు చేశారని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

బోయనపల్లి వద్ద విద్యార్థుల ఘర్షణ

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం బోయనపల్లి వద్ద విద్యార్థులు రెండు వర్గాలుగా ఏర్పడి ఘర్షణ పడ్డారు. గత రెండు రోజులుగా విద్యార్థులు వసతి గృహాల వద్ద మద్యం తాగి దాడి చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. అయితే అమ్మాయి ప్రేమ కారణంగా ఈ గొడవ జరిగినట్లు సమాచారం. దాడిలో గాయపడిన విద్యార్థులను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై మన్నూరు పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అదృశ్యంపై కేసు నమోదు

సంబేపల్లె(రాయచోటి), న్యూస్‌టుడే: సంబేపల్లె మండలం అడవికమ్మపల్లెకు చెందిన కుంచపు లోకేష్(14) కనిపించడం లేదని అతని తండ్రి రామయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఫీజు కట్టాలని రూ.500 డబ్బులు తీసుకొని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. అడవికమ్మపల్లె పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

బెదిరింపులపై...

సుండుపల్లి: ఒకరిని బెదిరించిన వ్యక్తిపై కోర్టు అనుమతితో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. ఇటీవల సుండుపల్లిలో మట్టి అనుమతులు లేకుండా తరలిస్తున్నారని ఫొటో తీసి సామాజిక మాధ్యమంలో పెట్టిన తనను జేసీబీ వెంకటేశ బెదిరించాడని బాధితుడు న్యాయం కోరాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సి.పోలిమేరపల్లె గ్రామం కాయలవాండ్లపల్లెలో నూతన తాగునీటి బోరును మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు, తెదేపా నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో ఏడాదిగా నీటి సమస్య నెలకొనడంతో గ్రామస్థులు సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి బోరు వేయించారు. ఈ బోరుకు మోటారు ఏర్పాటు చేసి ప్రారంభించడంతో తాగునీటి సమస్య తీరిపోయిందని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట మండలం ఊటుకూరు ప్రాంతానికి చెందిన పలువురు జనసేన పార్టీలో చేరారు. స్థానిక జనసేన కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు వారిని కండువా వేసి ఆహ్వానించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాలను అభివృద్ధిబాటలో నడిపిస్తున్న నేపథ్యంలో యువత ఆకర్షితులై పార్టీలో చేరారని తెలిపారు.



జనసేన పార్టీలో చేరిన వారితో యల్లటూరు శ్రీనివాసరాజు

పీడీఎస్‌యూ గోడపత్రాల ఆవిష్కరణ

రాజంపేట: పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాల గోడపత్రాలను మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పురుషోత్తం ఆవిష్కరించారు. మొదటి పీడీఎస్‌యూ మహాసభను నిర్వహించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 24న 11 రాష్ట్రాలతో కలిసి మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభను జయప్రదం చేయాలని కోరారు.

సంపద సృష్టి కేంద్రం తనిఖీ

సుండుపల్లి, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి మంగళవారం సుండుపల్లెకు వచ్చిన సందర్భంగా స్థానిక తెదేపా నాయకులు వినతి మేరకు మండల కేంద్రంలో ప్రధాన రహదారిపైకి వస్తున్న మురుగునీటి పరిస్థితిని పరిశీలించారు. యానాది కాలనీలో వీధులు సిమెంటు రహదారులు నోచుకోక గుంతలమయంగా ఉండటాన్ని పరిశీలించారు. సుండుపల్లి పుల్లారెడ్డిగారిపల్లె సమీపంలోని సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణ బాగుందని అభినందించారు. ఆయనవెంట ఈవోపీఆర్డీ సురేష్‌బాబు, నాయకులు ఎం.శివరాంనాయుడు, జి.మోహనబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభ

గుండ్లచెరువు(గాలివీడు), న్యూస్‌టుడే: రైతుల నుంచి వచ్చిన భూ సమస్యలను పరిష్కరిస్తామని ఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. గుండ్లచెరువు గ్రామంలో మంగళవారం రీసర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కార గ్రామసభ నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని బాధిత రైతులు అర్జీలు సమర్పించారు. భూముల విస్తీర్ణంలో వ్యత్యాసం, భూముల సర్వే నంబర్ల వ్యవహారం, పట్టాదారు పేరు నమోదు, జాయింట్ ఎల్పీఎం విభజన, ఉమ్మడి భూముల మ్యుటేషన్ విభజన సమస్యల పరిష్కారం కోసం రైతుల నుంచి అర్జీలు స్వీకరించామని తెలిపారు. అర్జీలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం... అన్నదాతలకు శాపం

పొలంబడి కార్యక్రమాల్లో రైతుల ఆవేదన ● ఎన్డీయే సర్కారుపైనే ఆశలు



పొలంబడి పేరుతో రైతులకు సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (పాత చిత్రం)

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో తమకు ఎలాంటి రాయితీ పథకాలు అందలేదని పొలంబడి కార్యక్రమాల్లో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల 24వ తేదీ నుంచి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో రైతులు తమ ఆవేదనను అధికారులు, శాస్త్రవేత్తల ముందు వాపోతున్నారు.

● గత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా కేంద్రాల పేరుతో ప్రతి పంచాయతీలోనూ రూ. లక్షల వ్యయంతో ప్రత్యేక కేంద్రాలను నిర్మించింది. సచివాలయాలతో ఇంటి వద్దకే పాలన అంటూ ప్రతి పంచాయతీకి సహాయ వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను నియమించారు. రైతులకు రాయితీలో ఇవ్వాల్సిన పథకాలను పక్కనపెట్టారు. రూ.కోట్లలో నిధులు వృథా అయ్యాయే తప్ప రైతులకు, వ్యవసాయ రంగానికి ఎలాంటి లబ్ధి చేకూరలేదు. ఉద్యోగంలో చేరిన విద్యావంతులు కూడా తాము ఏ పని చేయాలో తెలియక అవస్థలు పడిపోయారు. ఫలితంగా తాము నష్టపోయామని అన్నదాతలు వాపోతున్నారు.

వారానికి రెండు రోజులు పొలాల్లోనే...

ప్రస్తుతం పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా అధికారులు, శాస్త్రవేత్తలు ప్రతి మంగళ, బుధవారాల్లో పొలాల్లో పర్యటిస్తున్నారు. పండిస్తున్న పంటలు, వాటి యాజమాన్య పద్ధతులు, రైతులు వినియోగిస్తున్న ఎరువులు, పురుగు మందుల వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. తమకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి అధికార యంత్రాంగం వస్తుండడం మంచి విషయమని కర్షకులు చెబుతున్నారు.

రాయితీ పథకాలు పునరుద్ధరించాలి



రైతులకు అనేక వస్తువులు రాయితీపై ఇచ్చేవారు. జింక్, సల్ఫేట్, జిప్సం, బోరాన్‌వంటి సూక్ష్మ పోషకాలను అందించేవారు. గత వైకాపా ప్రభుత్వం వాటిని పూర్తిగా రద్దు చేసింది. దీంతో అప్పట్లో వీటిని దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వచ్చేది. పలు పథకాలను పునరుద్ధరించాలి. రైతులకు మేలు చేయాలి. - కె.సురేష్‌కుమార్‌రెడ్డి, రైతు, ఉర్లగడ్డపోడు

వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారు



గత వైకాపా పాలనలో అధికారులు, శాస్త్రవేత్తలు పొలాల వైపు వచ్చిన దాఖలాల్లేవు. వ్యవసాయ ల్లోనే వారి పనులు చేసుకుంటూ ఉండేవారు. రైతులకు ఏ సలహా కావాలన్నా కార్యాలయం, సచివాలయాల చుట్టూ తిరిగేవారు. ప్రస్తుతం పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. దీంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వానికి తెలుస్తాయి. వాటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. - చింతల రఘుపతి, రైతు, శాంతినగర్

ఉన్నతాధికారులకు నివేదించాం

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు అనేక సమస్యలను మా దృష్టికి తీసుకువస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన అనుబంధ శాఖల ద్వారా ఈ కార్యక్రమం జరుగుతోంది. గత ఐదేళ్లలో రాయితీ పథకాల్ని నిలిపివేయడంతో సాగు వ్యయం పెరిగింది. దీంతో రైతులు ఆర్థిక భారాన్ని మోస్తున్నారు. రాయితీ పథకాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు. వారి సమస్యలను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. - సుధాకర్, మండల వ్యవసాయ శాఖ అధికారి, రైల్వేకోడూరు